వేంసూరు ఉపాధ్యాయుడికి రాష్ట్రస్థాయి అవార్డు

ఉపాధ్యాయుడు రాంబాబును అభినందిస్తున్న డీఈవో

వేంసూరు/ ఖమ్మం అర్బన్, జూన్ 10: వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు ఏ. రాంబాబు రాష్ట్రస్థాయి గ్రీన్ చాంపియన్ పురస్కారం అందుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు, హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రకటించిన మూడు పురస్కారాల్లో వేంసూరు పాఠశాలకు ప్రథమస్థానం దక్కింది. గత విద్యా సంవత్సరంలో చేపట్టిన వివిధ పర్యావరణ స్నేహపూర్వక కృత్యలను గుర్తించి ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం జూన్ 5న రాంబాబు అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఉపాధ్యాయుడు రాంబాబును డీఈవో సామినేని సత్యనారాయణ, జిల్లా సీఎం వో ఎల గందుల రాజశేఖర్, పాఠశాల ఉపాధ్యాయుడు బీకే.నరసింహారావు అభినందించారు.

అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన

విద్యార్థులను అభినందిస్తున్న డీఐఈవో రవిబాబు

ఖమ్మం అర్బన్, జూన్ 10: ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన కామేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను డీఐఈవో రవిబాబు అభినందించారు. మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీసీలో వరలక్ష్మి 962 మార్కులు సాధించారన్నారు. గొప్ప ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బీజే విద్యాసాగర్, అధ్యాపకులు ఎం సతీష్, పావురాల వెంకటనారాయణ, జీ నరేష్, కే వినోద్‌బాబు, డీ శ్రీనివాస్, ఎస్‌కే అక్బర్‌బాషా, ఎస్‌కే గౌస్యబేగం, బీ ప్రసాద్, కృష్ణమూర్తి, ఎం పాషా తదితరులు పాల్గొన్నారు.

యోగాను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: డీవైఎస్‌వో

యోగా చేస్తున్న డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి

ఖమ్మం సిటీ, జూన్ 10: యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి తుంబూరు సునీల్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవ అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సిద్ధార్థ యోగ విద్యాలయం, జిల్లా క్రీడా సంస్థ సహకారంతో మంగళవారం ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో ఉచిత యోగ క్యాంపును ఏర్పాటు చేయగా డీవైఎస్‌వో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వరకు ఉచిత శిక్షణ ఉంటుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యోగ మాస్టర్ కొండల్‌రావు శిక్షణ ఇస్తున్నారు.

డీసెట్ సర్టిఫికెట్ల పరిశీలనకు 485మంది హాజరు

సర్టిఫికెట్ల పరిశీలన చేస్తున్న డైట్ అధికారులు

ఖమ్మం అర్బన్, జూన్10 : డీఈడీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన ప్రక్రియలో భాగంగా నగరంలోని డైట్ కళాశాలలో సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహిస్తున్నారు. మంగళవారం డీసెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు 485మంది హాజరై తమ ధ్రువపత్రాలను పరిశీలన చేయించుకున్నట్లు డీఈవో, డైట్ ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగనుంది. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఎస్.ప్రసాద్, బాల మురళి, పద్మ, ఎర్రమల శ్రీనివాసరావు, అమీర్ ఖాన్, జీ నవీన్, సుధీర్, రాజారావు, సందీప్ పాల్గొన్నారు.

ఉద్యోగులు, పింఛన్‌దారులకు మందులు సరఫరా చేయాలి

ఆర్ఎంవోకు వినతిపత్రం అందజేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

ఖమ్మం అర్బన్, జూన్ 10 : ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలోని వెల్నెస్ సెంటర్‌లో ఉద్యోగులు, పింఛన్‌దారులకు గత మూడునెలలుగా మందులు సరఫరా కావట్లేదని పీఆర్‌టీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోత్కూరి మధు, కందుల వెంకటనరసయ్య, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లు అన్నారు. చిన్నచిన్న వ్యాధులకు వైద్య పరీక్షలు చేసేందుకు పరికరాలు పనిచేయడంలేదన్నారు. తక్షణమే కలెక్టర్ జోక్యం చేసుకుని రాష్ట్ర ఆరోగ్యశ్రీట్రస్ట్ ద్వారా అన్నిరకాల మందులు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆసుపత్రి ఆర్ఎంవో బి రాంబాబు, వెల్నెస్‌సెంటర్ డాక్టర్లను కలిసి సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌రావు, కొండల్‌రావు, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, **కల్లూరు బ్రాంచ్** వారు ఇచ్చిన బౌగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **ఇనపనపల్లి నాగమణి** W/o. శ్రీను, **వయస్సు:** 39సం||లు, **వృత్తి:**గృహిణి, నివాసం: ఇ.నెం:7-74, అన్నారుగూడెం గ్రామం, తల్లాడ మండలం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు చ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు వార్లీలు, కైయిములు, తనఖాలు అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 8 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : ఖమ్మం జిల్లా, కల్లూరు సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలోని ఖమ్మం జిల్లా, తల్లాడ రెవిన్యూ మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామపంచాయితీ ఏరియాలోని అన్నారుగూడెం రెవిన్యూ రికార్డు దాఖలా విస్తీర్ణము : 132.2 చ||గ||. స్థలము లేదా 110.53 చ||మీ||, **డాక్యుమెంట్ నెం: 813/2025,** నివేశన స్థలము మరియు అన్నారుగూడెం గ్రామకంఠంలోని గ్రామపంచాయితి డోర్ నెం.7-92 (Assessment No. 1089) నెంబరు గల ఆర్‌సిసి బిల్డింగ్ వైశాల్యం 144 చ||అ||. స్థిరాస్తికి సరిహద్దులు : **తూర్పు:** గొడ్ల కృష్ణ గారి ఇల్లు, **పడమర:** దారి & ఇస్నేపల్లి బాబు గారి ఇల్లు, **ఉత్తరము :** గొడ్ల తిరుపతయ్య గారిఇల్లు, **దక్షిణము :** కాలువ.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం.సెల్ : 9849246278

నేడు ఆర్టీసీ బస్టాండ్‌కు శంకుస్థాపన

మధిర, జూన్ 10: మధిరలో నూతన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణానికి బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు శంకుస్థాపన చేయడం జరుగుతుందని ఖమ్మం ఆర్టీసీ రీజినల్ మేనేజర్ హరిరామ్ తెలిపారు. కార్యక్రమానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు, అధికారులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

మహిళా సమాఖ్యపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, స్త్రీ టీ మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్

మధిర(చింతకాని), జూన్ 10: మహిళా సమాఖ్యపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టాలని, పారదర్శకంగా ఇసుక రవాణా జరగాలని, ఎటువంటి అక్రమాలు జరగడానికి వీలు లేదని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. మంగళవారం చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలో సింధూ గ్రామ సమాఖ్య ద్వారా ఏర్పాటు చేసిన ఇసుక పాయింట్, తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి స్త్రీ టీస్టాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సమాఖ్య ద్వారా ఇసుక పాయింట్ ఏర్పాటు చేస్తామని, ఎటువంటి అవకతవకలు, అక్రమాలు జరగడానికి వీలు లేదని, కూపన్ ఆధారంగా మాత్రమే ఇసుక పాయింట్ నుంచి ఇసుక తరలింపు జరగాలన్నారు. ఇసుక కూపన్‌లను, చెరువు వద్ద లోడ్ అవుతున్న ట్రాక్టర్ వద్ద ఉన్న కూపన్‌ను కలెక్టర్ పరిశీలించారు. లోడింగ్‌కు డబ్బు ఖర్చవుతుందని తెలుసుకున్నారు. జేబీసీలను అనుమతించడానికి వీలు లేదన్నారు. ఇసుక పాయింట్ వద్ద 10 రోజుల్లో చెక్‌పోస్టు వంటిది మహిళలు ఉండే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక పాయింట్ వద్ద మద్యం సేవించి ఎవరైన వచ్చిన వెంటనే వెంటనే తహసీల్దార్, పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ఇసుక పాయింట్ నిర్వహణ బాధ్యతలను మహిళా సమాఖ్యలకు అప్పగించడం జరుగుతుందన్నారు. అనంతరం టీ స్టాల్ వద్ద కాఫీ తాగారు. స్త్రీ శక్తి భవనం నిర్మాణ పెండింగ్ పనులకు రూ.5 లక్షలు అవుతుందని చెప్పగా జిల్లా కలెక్టర్ వెంటనే రూ.5 లక్షల చెక్‌ను ఎంపీడీవోకు అందిస్తూ నెల రోజుల లోపు నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో చింతకాని తహసీల్దార్ కే.అనంతరాజు, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీఎం శ్రీనివాసరావు, సింధూ గ్రామసమాఖ్య సభ్యులు బేబిరాణి, లక్ష్మి, ఇందిరా, భాగ్యలక్ష్మి, ఏపీఎం శ్రీనివాసరావు, స్త్రీ టీ షాపు నిర్వాహకురాలు కే.భవానీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పున:ప్రారంభం

ఖమ్మం రూరల్: హాజరైన డీడబ్ల్యూవో, సీడీపీవో చిన్నారులు, చిన్నారులకు ఎగ్ బిర్యాని వడ్డిస్తున్న డీడబ్ల్యూవో, సత్తుపల్లి: ర్యాలీలో ఐసీడీఎస్ అధికారులు, చిన్నారులు

ఖమ్మం రూరల్, జూన్ 10: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం పున: ప్రారంభించారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుర్రాలపాడు అంగన్‌వాడీ కేంద్రానికి హాజరైన జిల్లా సంక్షేమ అధికారి కే రాంగోపాల్‌రెడ్డి, రూరల్ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి కమలప్రియకు అంగన్‌వాడీ టీచర్ జ్యోతి ఆధ్వర్యంలో చిన్నారులు స్వాగతం పలికారు. అంగన్‌వాడీ చిన్నారులకు అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ప్రీస్కూల్ పిల్లల కోసం రూపొందించిన నూతన సెలబస్‌లోని ఐదు అంశాలను సెక్టార్ పర్యవేక్షకురాలు షాకీరాబేగం పిల్లలతో కలిసి ప్రదర్శించారు. అధికారులు సెల్ఫీ విత్ చైల్డ్ ప్రోగ్రాంలో భాగంగా పిల్లలతో సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూవో మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు కాన్వెంట్లకు దీటుగా అంగన్‌వాడీలో నాణ్యమైన విద్యతో పాటు, సంపూర్ణ ఆరోగ్యం అందుతుందన్నారు. కేంద్రాల బలోపేతానికి పిల్లల తల్లితండ్రులు సంపూర్ణ సహకారం అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో టీచర్లు జ్యోతి, హెల్పర్ నీలిమ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యా బోధన

సత్తుపల్లి, జూన్ 10: నవీకరించిన పూర్వ ప్రాథమిక విద్యా సిలబస్‌తో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన అందించడం జరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీవో నిర్మల జ్యోతి అన్నారు. మంగళవారం సూపర్‌వైజర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో కల్లూరు అంగన్‌వాడీ-6 కేంద్రంలో అమ్మమాట- అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మామిడి తోరణాలు, బెలూన్స్, పూలతో అంగన్‌వాడీ కేంద్రాలను అలంకరించారు. సీడీపీవో నిర్మలజ్యోతి మాట్లాడుతూ 30 నెలలు నిండిన పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన పద్ధతిలో విద్యాబోధన నిర్వహించడానికి శ్రీకారం చుట్టామన్నారు. ఏసీడీపీవో రత్తమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో విద్యాబోధన నిర్వహిస్తున్నామన్నారు. చిన్నారులకు క్రమశిక్షణతో విద్యాబోధన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించడం జరుగుతుందన్నారు. అనంతరం చిన్నారులతో తల్లిదండ్రులు సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సఫియాబేగం, ఆయా లీల, తల్లులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం, జూన్ 10: ఖమ్మం జిల్లాలోని దివ్యాంగులు సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కీసర రాంగోపాల్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను శారీరక వైకల్యం, బధిరులు, అంధులకు సహాయార్థం రెట్రోఫిట్టెడ్ మోటరైడ్ వెహికిల్స్, బ్యాటరీ వీల్‌చైర్స్, మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రైసైకిల్స్, బ్యాటరీ మిని ట్రేడింగ్ ఆటో వెహికిల్స్, హైబ్రిడ్ వీల్‌చైర్స్ అటాచ్మెంట్ వీల్‌చైర్స్, లార్జ్‌ట్యాప్స్, ట్యాబ్స్, 5జీ స్మార్ట్ ఫోన్స్, మూడుచక్రాల ట్రైసైకిల్స్, సాధారణ వీల్‌చైర్స్, చంక కర్రలు, చేతి కర్రలు, హియరింగ్ ఎయిడ్స్ తదితర సహాయ ఉపకరణాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. https://tsobmms.cgg. gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 18 వరకు దరఖాస్తు చేసుకొని ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం, ఇతర ధ్రువపత్రాలు జతపరిచి కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు.

శ్రమకు, కష్టజీవులకు విలువ లేదు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

బోనకల్లు జూన్ 10: పెట్టుబడిదారి సమాజంలో శ్రమకు, కష్టజీవులకు విలువ లేదని సీపీఎం రాజకీయ విద్యావిభాగం సభ్యుడు బండారు రమేశ్ అన్నారు. బోనకల్లులోని ఎస్ఆర్.ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం మధిర డివిజన్ స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు రెండోరోజు మంగళవారం నిర్వహించారు. సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మేడేపల్లి గోపాలరావు ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. రాజకీయ అర్థశాస్త్రం, ఆర్థిక విధానాలు అనే అంశంపై బోధించారు. దోపిడి సమాజంలోను కమ్యూనిస్టులు ఉంటారని, కానీ కమ్యూనిస్టులు దోపిడి వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేస్తారన్నారు. కార్యకర్తలకు సిద్ధాంతంపై అవగాహన కల్పించేందుకే ఈ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయ అర్థశాస్త్రం అంటే ఉత్పత్తి అని తెలిపారు. ఉత్పత్తి జరిగేటప్పుడు దోపిడి జరుగుతుందన్నారు. పోలేపల్లి సోమయ్య మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తర్వాత జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రిగా అయిన తర్వాత ఆయన అనుసరిస్తున్న విధానాల విషయంలో కమ్యూనిస్టు పార్టీలో విభేధాలు ఏర్పడ్డాయన్నారు. వర్గపోరాటాల ద్వారానే సమసమాజ స్థాపన సాధ్యమవుతుందని, ఆ విధంగా సీపీఎం శ్రేణులు పోరుబాట పట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిగొండ, చింతకాని, బోనకల్లు, మధిరరూరల్ మండలాల కార్యదర్శులు బట్టు పురుషోత్తం, రాచబంటి రాము, కిలారు సురేష్, మంద సైదులు, సీపీఎం నాయకులు చింతలచెరువు కోటేశ్వరరావు, పాపినేని రామనర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

జూలై 19, 20 తేదీల్లో సీపీఐ జిల్లా మహాసభలు

సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

మధిర, జూన్ 10: జూలై 19, 20 తేదీల్లో మధిరలో సీపీఐ జిల్లా మహాసభలు జరుగుతాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బెజవాడ రవిబాబు, మందడపు రాణి అన్నారు. మంగళవారం మధిరలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక రిక్రియేషన్ క్లబ్‌లో జరిగే జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం సమావేశానికి పార్టీ శ్రేణులు, అభిమానులు, వామపక్ష కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. తెలంగాణ సాయుధ పోరాటానికి మధిర ఉద్యమ గుమ్మమని, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4500 మంది అమరులయ్యారని, నైజాం నవాబుకు వ్యతిరేకంగా పోరాడి 10 లక్షల ఎకరాలు పేదలకు పంచిన చరిత్ర సీపీఐకి ఉందన్నారు. సమావేశంలో సీపీఐ మధిర మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, నాయకులు ఎంఏ.రహీం, పెరుమాళ్లపల్లి ప్రకాశరావు, మడుపల్లి లక్ష్మణ్, చావా మురళీ, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి చెరుకూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆత్మీయ భరోసాను వెంటనే అమలు చేయాలి

తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఖమ్మం రూరల్, జూన్ 10: వ్యవసాయ కార్మికులకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను వెంటనే అమలు చేయాలని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి బందెల వెంకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ పీ రాంప్రసాద్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు కావస్తున్నా వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీ నిలబెట్టుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ కార్యదర్శి రెంటాల యాదగిరి, వెంకట అప్పారావు, రెంటాల రామదాసు, కందుల స్వామి, వీరబాబు, ఉపేందర్, రమేశ్, మోహన్‌రెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

అనుమతులు లేని పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పీ సుధాకర్

ఖమ్మం రూరల్, జూన్ 10: అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పీ సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో గల సీపీఎం కార్యాలయంలో సంఘం పాలేరు డివిజన్ కమిటీ బాధ్యుడు జీ వరుణ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుధాకర్ మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యా సంస్థల ఫీజు దొపిడి అరికట్టాలని, పాఠ్య పుస్తకాలు, దుస్తులు, స్టేషనరీలను అక్రమంగా అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ప్రైవేట్ పాఠశాలలో విధిగా ఫీజులకు సంబంధించిన బోర్డులను ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హరీష్, సాయి, కృష్ణ, సుశాంత్ పాల్గొన్నారు.

దేవబత్తిని పుల్లమ్మకు పరామర్శ

పుల్లమ్మను పరామర్శిస్తున్న భూక్యా వీరభద్రం

వైరాటౌన్, జూన్ 10: తొలితరం సీపీఎం నాయకుడు దేవబత్తిని భూషయ్య సతీమణి పుల్లమ్మను ఆపార్టీ వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్ మంగళవారం పరామర్శించారు. ప్రస్తుతం అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న నాయకులు మంగళవారం బ్రాహ్మణపల్లిలోని వారి స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దేవభక్తిని నాగేశ్వరరావు, కొమ్మినేని లీలమ్మ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో ఎస్సీలకు అన్యాయం

కూసుమంచి, జూన్ 10: ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో కూడా అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ కూసుమంచిలోని నేలకొండపల్లి రోడ్డులో గల ఎస్సీ కాలనీకి చెందిన మహిళలు మంగళవారం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి భీంరెడ్డి శ్రీనివాసరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. పేదలకు ఇళ్లు ఇవ్వలేదని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

క్లినికల్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మం అర్బన్, జూన్ 10: జిల్లాలో ఎంఎల్‌టీ, ఓకేషనల్ కోర్సులో 2020 నుంచి ఉత్తీర్ణులైన విద్యార్థులు క్లినికల్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని డీఐఈవో రవిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.వెయ్యి డీడీ రూపంలో చెల్లించి ఈ నెల 21వ తేదీలోగా డీఐఈవో కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

పండ్ల తోటల పెంపకానికి ఆర్థికసాయం

సత్తుపల్లి, జూన్ 10: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా హార్టికల్చర్ ప్లాంటేషన్ కింద 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు పండ్ల తోటల పెంపకానికి ఆర్థిక సాయం అందజేస్తామని ఎంపీడీవో నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు మొక్కలు నాటుకునేందుకు గుంతలు తీసే ఖర్చు, మొక్క నాటే ఖర్చు, మొక్కల ఖరీదు, ప్రతినెలా ఒక మొక్కకు నిర్వహణ ఖర్చులు మూడు సంవత్సరాలు పాటు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులకు 5 ఎకరాల లోపు భూమి కలిగి ఉండి, జాబ్‌కార్డు కలిగి ఉండాలన్నారు. బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్ డాక్యుమెంట్లతో ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్ సునీత ఎల్జెబిత్

ముదిగొండ, జూన్ 10: భూ సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు ఆరో రోజు మంగళవారం మండలంలోని మాధాపురం, కమలాపురం గ్రామాల్లో నిర్వహించారు. 202 దరఖాస్తులు వచ్చాయని. భూ సమస్య ఉన్నవారు దరఖాస్తుల ఇవ్వాలని తహసీల్దార్ సునీత ఎల్జెబిత్ సూచించారు. వచ్చిన దఖాస్తులను ఆన్‌లైన చేసి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన తరువాత ఆమోదిస్తామని తెలిపారు.

పెనుబల్లిలో..

రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న అధికారులు

పెనుబల్లి, జూన్10: భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మంగళవారం మండలంలోని మండలపాడు గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడారు. భూభారతి చట్టం 2025 ద్వారా భూ సమస్యలు ఉండవన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్రగౌడ్, తహసీల్దార్ రమేశ్, ఆర్ఐ భాస్కర్, రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పంది వెంకటేశ్వరరావు, గ్రామస్తుల పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సంస్థ బాధ్యులు

కొణిజర్ల, జూన్ 10: గ్రేస్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు, గ్రేస్ విద్యా సంస్థల అధినేత బిషప్ ఎం.జాకబ్ జన్మదినం సందర్భంగా మంగళవారం గ్రేస్ జనరల్ హాస్పిటల్‌లో ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. సుమారు 150 మంది రక్తదానం చేయగా తలసేమియా బాధితులకు అందించారు. కార్యక్రమంలో ఎం.సామ్యేల్‌జోషప్, గ్రేస్ హాస్పిటల్ అధినేత డాక్టర్ విక్టోరియా, ఎలిజిబేత్, హాస్పిటల్ సిబ్బంది, గ్రేస్ విద్యాసంస్థల ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ నెల 13నుంచి రాజకీయ శిక్షణ తరగతులు

వైరాటౌన్, జూన్ 10: కామేపల్లి మండలం లింగాల క్